చదువు

ఈనాడు

హైదరాబాద్ 10

బుధవారం జూన్ 13, 2018 ■ e-mail: edc@eenadu.in

నీట్-2018 యూజీ ఫలితాలు వెలువడి, కొత్త విద్యా సంవత్సరంలో మెడికల్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. తెలుగు విద్యార్థులు తొలిసారిగా అఖిల భారత వైద్యవిద్య కూటమి (నేషనల్ పూల్)లోకి వెళ్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ విధానాన్ని విద్యార్థులూ, తల్లిదండ్రులూ సమగ్రంగా అవగాహన చేసుకోవటం, గత ఏడాది ఆలిండియా కోటా ర్యాంకుల కటాఫ్‌ను పరిశీలించటం వల్ల సీట్ల లభ్యతపై కొంత అంచనా వస్తుంది. ఇందుకు ఉపకరించే వివరాల విశ్లేషణ... ఇదిగో!

మెడికల్ సీట్లకు ముందడుగు ఎలా?

నీట్-2018 కౌన్సెలింగ్

గత సంవత్సరంతో పోలిస్తే నీట్ కటాఫ్ మార్కు బాగా తగ్గింది. విద్యార్థుల సంఖ్య దాదాపు 16 శాతం పెరిగింది. కేటగిరీ వారీగా కటాఫ్ మార్కు, విద్యార్థుల సంఖ్య కింది విధంగా ఉంది.

కేటగిరి	కటాఫ్ పర్సంటైల్	కటాఫ్ మార్కు	విద్యార్థుల సంఖ్య
అన్ రిజర్వ్‌డ్	50	119	6,34,897
అన్ రిజర్వ్‌డ్ పీహెచ్	45	107	205
ఎస్‌సీ	40	96	17,209
ఎస్‌టీ	40	96	7446
ఓబీసీ	40	96	54,653
ఎస్‌సీ-పీహెచ్	40	96	36
ఎస్‌టీ-పీహెచ్	40	96	12
ఓబీసీ-పీహెచ్	40	96	104

ఈ పట్టిక చూడగానే చాలామంది రిజర్వేషన్లో చాలా తక్కువమంది ఉన్నారని భావిస్తారు. కానీ ఆ సంఖ్య 50వ పర్సంటైల్ నుంచి 40వ పర్సంటైల్ లోపు ఉన్న విద్యార్థులు. అంటే ఓబీసీలో మొత్తం విద్యార్థులు 54,653 కాదు. మొదట 50వ పర్సంటైల్‌లో దాదాపు 3 లక్షలమంది వరకూ ఉంటారు.

పి.వి.ఆర్.కె. మూర్తి
చైర్మన్, శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

అర్హత పొందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ నుంచి 35,732 మంది, తెలంగాణ నుంచి 30,912 మంది. అంటే.. తెలుగు రాష్ట్రాల నుంచి అర్హులైనవారు మొత్తం 66,644 మంది విద్యార్థులు. వీరిందరికీ ఇది తొలిసారి కాబట్టి కౌన్సెలింగ్ ఏ విధంగా జరుగుతుందో చూడాలి.

ఈ కౌన్సెలింగ్‌ని నాలుగు భాగాలుగా అవగాహన చేసుకోవడం మేలు. 1) ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) 2) స్టేట్ కోటా 3) మేనేజ్‌మెంట్ లేదా ఎన్ఆర్ఐ సీట్ల కోటా 4) డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల కోటా.

నీట్- 2017 కౌన్సెలింగ్ (ఆలిండియా కోటా)

- మొదటి రౌండ్‌లో అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో కటాఫ్ ర్యాంకు 5779, రెండో రౌండ్‌లో 8317.
- బీడీఎస్‌లో తొలిరౌండ్‌లో కటాఫ్ ర్యాంకు 10,920, రెండో రౌండ్‌లో కటాఫ్ ర్యాంకు 12,419.

వీటిలో ఆలిండియా కోటా, డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల్లో అడ్మిషన్ల ప్రక్రియను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) తరపున డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (డీజీహెచ్ఎస్) నిర్వహిస్తుంది. దీనిద్వారా ఆలిండియా కోటాలోని ప్రభుత్వ మెడికల్, డెంటల్ కళాశాలల్లోని 15 శాతం సీట్లు, డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 100 శాతం సీట్లు, ఈఎస్ఐ మెడికల్ కళాశాలలోని ఇన్సూర్డ్ పర్సన్స్ కోటా, ఏఎఫ్ఎంసీ- పుణెలోని సీట్లు నింపుతారు.

కౌన్సెలింగ్ దరఖాస్తు విధానం

కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి పత్రాలు ఏమీ అవసరం లేదు. కానీ, విద్యార్థి కొంత డేటా తనతో ఉంచుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇది మొత్తం నాలుగు అంచెల్లో జరుగుతుందని చెప్పొచ్చు.

మొదటి అంచె: mcc.nic.in వెబ్‌సైట్‌లో ముందుగా విద్యార్థి లాగిన్ అవ్వాలి. దానిలో కింద Already signed in, New Registration, Forgot Password అని మూడు బాక్సులు ఉంటాయి. ఇంతకు ముందే రిజిస్ట్రేషన్ చేసుంటే దానిలోకి వెళ్లొచ్చు. అదే తొలిసారిగా అయితే New Registration పై క్లిక్ చేయాలి. తరువాతి పేజీలో రోల్ నంబరు, రిజిస్ట్రేషన్ నంబరు, విద్యార్థి పేరు, తల్లి పేరు, పుట్టిన తేదీ, మొబైల్ నంబరు, ఈ-మెయిల్‌ను అడుగుతుంది. అవి నింపిన తరువాత కింద ఒక సెక్యూరిటీ కోడ్ కనిపిస్తుంది. దాన్ని బాక్సులో టైప్ చేస్తే కింద Submit, Reset అనే రెండు బటన్లు ఉంటాయి. ఏవైనా మార్పులు చేయదలచుకుంటే Reset నొక్కి మళ్లీ మొదటి నుంచి ప్రక్రియ చేయాలి. పూర్తిగా సరిగా ఉంటే Submit నొక్కితే ఓటీపీ (వన్ టైం పాస్‌వర్డ్) జెనరేట్ అవుతుంది. దానిని ఎంటర్ చేస్తే తరువాతి విండోకి వెళుతుంది. దానిలో Terms and conditions ఉంటాయి. వాటిని చదివి కింద I agree అని ఉన్న చోట క్లిక్ చేస్తే తరువాతి విండోకి వెళుతుంది. దానిలో మెయిలింగ్ అడ్రస్, పిన్‌కోడ్ వివరాలు నింపిన తరువాత సెక్యూరిటీ ప్రశ్న, దాని సమాధానాన్ని కూడా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. దాని తరువాత పాస్‌వర్డ్ జెనరేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

పాస్‌వర్డ్: పాస్‌వర్డ్ 8-13 అక్షరాల్లో ఉండాలి. వీటిలో ఒక కాపిటల్ లెటర్, ఒక స్మాల్ లెటర్, 0-9 వరకు ఒక సంఖ్య, ఒక స్పెషల్ క్యారెక్టర్ (*, !) లాంటివి ఉండాలి. ఈ పాస్‌వర్డ్‌ను ఏర్పరచుకుని Submit నొక్కితే కన్ఫర్మేషన్ అడుగుతుంది. దీనిలో Back నొక్కితే మళ్లీ చేయాలి లేదా Confirm registration అంటే ప్రక్రియ పూర్తై రిజిస్ట్రేషన్ స్లిప్ వస్తుంది. దీన్ని తొలి అంచెగా చెప్పొచ్చు.

రెండో అంచె: కళాశాల ఎంపిక రెండో అంచె అవుతుంది. దీనిని ఓపెన్ చేయగానే విద్యార్థికి లభ్యమయ్యే కళాశాలల వివరాలు వస్తాయి. వాటిలో 5 చాయిస్‌లు తీసుకుని నింపాలి. ఈ ఎంపికలో ఏ కళాశాలనైనా విద్యార్థి ఎంపిక చేసుకోవచ్చు. AIQ లో తెలుగు విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వ కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చో లేదో అనే సంశయంతో ఉన్నారు. ఏఐక్యూలో ఏ రాష్ట్ర విద్యార్థి అయినా ఏ రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలనైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అంటే తెలుగు విద్యార్థులు ఏఐక్యూలో తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను కూడా ఎంచుకోవచ్చు.

మూడో అంచె: కళాశాలలు ఎంపిక చేసుకున్న తరువాత ఎన్ని కళాశాలలనైనా మార్చుకోవచ్చు. వాటి వరుసక్రమాలు కూడా విద్యార్థి అనుకున్న రీతిలో మార్చుకోవడానికి అవకాశాలున్నాయి. ఎంపిక చేసుకున్న తరువాత లాకింగ్ చేయొచ్చు. ఒకసారి లాక్ చేసుకున్న తరువాత రెండో రౌండ్ కౌన్సెలింగ్ వరకు మార్పు చేసుకోవడానికి అవకాశం లేదు. కాబట్టి ముందుగానే సరిగా సరిచూసుకుని లాక్ చేసుకుంటే దాని ప్రింట్ అవుట్ విద్యార్థికి వస్తుంది. దీంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.

నాలుగో అంచె: జూన్ 22న సీట్ల కేటాయింపు ప్రకటిస్తారు. కాబట్టి, జూన్ 23- జులై 3లోపు కేటాయింపు జరిగిన కళాశాలలో రిపోర్టింగ్ చేయాలి. ఆ సమయంలో విద్యార్థి తనతో పాటు సర్టిఫికెట్లు, నిర్ణీత ఫీజు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

కావాల్సిన సర్టిఫికెట్లు: ✦ పరీక్ష అడ్మిట్ కార్డు (సీబీఎస్ఈ జారీ చేసింది) ✦ ర్యాంకు కార్డు (సీబీఎస్ఈ జారీ చేసింది) ✦ జనన ధ్రువీకరణ పత్రం ✦ పదో తరగతి సర్టిఫికెట్ ✦ 10+2/ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ ✦ 10+2/ ఇంటర్మీడియట్ మార్కుల జాబితా ✦ పాస్‌పోర్ట్ సైజు ఫొటోగ్రాఫ్‌లు- 8 ✦ ప్రింటెడ్ అలాట్‌మెంట్ లెటర్- జెనరేటెడ్ ఆన్‌లైన్ ✦ ఆధార్ కార్డు ✦ ఎస్‌సీ/ ఎస్‌టీ/ ఓబీసీ/ పీహెచ్ సర్టిఫికెట్లు సంబంధిత సర్టిఫికెట్లతో కేటాయించిన కళాశాలలో జులై 3 లోపు చేరాల్సి ఉంటుంది.

ఐదో అంచె: మొదటి రౌండ్‌లో సీటు కేటాయింపు జరగకపోయినా లేదా వదిలేసుకున్నా పై విధానంలోనే రెండో కౌన్సెలింగ్‌కు వెళ్లడం. దీనికి చాయిస్ ఫిల్లింగ్ జులై 6-8 వరకు, పేమెంట్ ఫర్ రిజిస్ట్రేషన్ జులై 9 మధ్యాహ్నం 12 గం.లోపు పూర్తిచేసి తొలి రౌండ్ లాగానే సీట్లు కేటాయిస్తారు. సంబంధిత కళాశాలల్లో జులై 13 నుంచి జులై 22లోపు రిపోర్టు చేయాలి. జులై 23న ఏఐక్యూలో మిగిలిన సీట్లను సంబంధిత రాష్ట్రాలకు బదిలీ చేస్తారు.

ఆరో అంచె: ఏఐక్యూ విద్యార్థులకు ఐదో అంచె ఆఖరుగా చెప్పొచ్చు. ఆరో అంచెను Mop up round అంటారు. ఇది కేవలం డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మాత్రమే వర్తిస్తుంది. సెంట్రల్ యూనివర్సిటీల్లో చాలావరకు సీట్లు రెండో రౌండ్‌లోనే భర్తీ అవుతున్నాయి. కానీ డీమ్డ్ యూనివర్సిటీల్లో ఎక్కువ భాగం Mop up round లోనే నింపడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రక్రియ తొలి రెండు రౌండ్లలాగానే నిర్ణీత తేదీల్లో జరుగుతుంది. ఇక్కడ సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 18-26లోపు నిర్ణీత కళాశాలలో చేరాలి. మిగిలిన సీట్లను ఆగస్టు 27కు సంబంధిత డీమ్డ్ యూనివర్సిటీకి బదిలీ చేస్తారు. ఈ సీట్ల సంఖ్య కూడా బాగా ఎక్కువగానే ఉంటోంది. వీటిని ఆగస్టు 27 తరువాత, 30లోపు యూనివర్సిటీ వారు నీట్-2018లో క్వాలిఫై అయిన విద్యార్థులతో నింపుతారు.

ముఖ్యమైన తేదీలు

- విద్యార్థులు జూన్ 13 నుంచి జూన్ 18వ తేదీలోపు రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్ చేసుకోవచ్చు.
- రిజిస్ట్రేషన్‌కు నిర్ణీత ఫీజును జూన్ 19వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు చెల్లించవచ్చు.
- సీట్ల కేటాయింపు ప్రక్రియ ఎంసీసీ సర్వర్‌లో జూన్ 20, 21 తేదీల్లో జరుగుతుంది.
- మొదటి రౌండు సీట్ల కేటాయింపు ఫలితాలను జూన్ 22న ప్రకటిస్తారు.
- సంబంధిత కళాశాలలో విద్యార్థి జూన్ 23 నుంచి జులై 3 వరకూ రిపోర్ట్ చేయాల్సివుంటుంది.
- మొదటి రౌండులో సీటు పొందకపోయినా, స్కిప్ అయినా తర్వాత రౌండు ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలకు జులై 6 నుంచి పై విధంగానే జరుగుతుంది.
- జులై 23న ఆలిండియా కోటాలో మిగిలిన సీట్లను సంబంధిత రాష్ట్రాలకు రాష్ట్రస్థాయి కౌన్సెలింగుకు కేటాయిస్తారు.

డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మాత్రమే మూడో రౌండు మాప్ అప్ అనేది నిర్వహిస్తారు. డీమ్డ్ యూనివర్సిటీల్లో ఫీజు చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి తొలిరౌండులో 10 శాతం లోపు సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి. రెండో రౌండు పూర్తయ్యేటప్పటికి కూడా 75 శాతం వరకూ ఖాళీగా ఉంటున్నాయి. ఆ సీట్లన్నీ మాప్ అప్ రౌండులో పిలుస్తున్నారు.

మాప్ అప్ రౌండుకి రిజిస్ట్రేషన్ ఆగస్టు 12 నుంచి ఆగస్టు 14 వరకూ జరుగుతుంది. ఆగస్టు 15 మధ్యాహ్నం 12 గంటల వరకూ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవచ్చు. ఆగస్టు 16 నుంచి సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆగస్టు 18 నుంచి ఆగస్టు 26లోపు నిర్ణీత కళాశాలల్లో జాయిన్ కావాలి.

ఇంకా మిగిలిన సీట్లను ఆగస్టు 27న సంబంధిత డీమ్డ్ యూనివర్సిటీకి బదిలీ చేస్తారు.

మిగిలిన సీట్లకు నీట్‌లో క్వాలిఫై అయిన ఏదో ఒక విద్యార్థితో ఆగస్టు 27- 30 లోపు యూనివర్సిటీ ఆ సీట్లను నింపుకోవచ్చు.

ఆల్‌ఇండియా కోటాలో నీట్-2017 కటాఫ్ ర్యాంకులు; ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నీట్ మార్క్ కౌన్సెలింగ్ కోసం https://goo.gl/HaiUWz లేదా www.eenadupratibha.net చూడవచ్చు.

నేషనల్ పూల్.. ప్రభుత్వ కళాశాలలకేనా?

మన దగ్గర బి-కేటగిరీ సీట్లు ఉన్నట్లే వేరే రాష్ట్రాల్లోని బి-కేటగిరీలో అడ్మిషన్లను మనం తీసుకోవచ్చా? దీనికి మార్గదర్శకాలేంటి?

జ: ప్రతి రాష్ట్రంలోని ప్రైవేటు కళాశాలల్లో బి, సి కేటగిరీ సీట్లున్నాయి. ఈ సీట్లను ప్రతి రాష్ట్రంలోనూ వారి నిబంధనలకు అనుగుణంగా నింపుతారు. వీటిలో రాష్ట్రానికి కానీ, సామాజిక వర్గానికి కానీ సంబంధించి ఎలాంటి రిజర్వేషన్ వర్తించదు. దేశంలోని ఏ విద్యార్థి అయినా నీట్-2018లో క్వాలిఫై అయితే మెరిట్ ప్రకారం చేరవచ్చు. అయితే వివిధ రాష్ట్రాల్లో ఫీజులు లేదా, సీట్లు నింపే పద్ధతులు బి, సి కోటా సీట్ల పర్సంటేజీ వేర్వేరుగా ఉన్నాయి.

15% నేషనల్ పూల్ అనేది ప్రభుత్వ కళాశాలలకేనా? ప్రైవేటు కళాశాలలకు కూడానా?

జ: ఆలిండియా కోటా (ఏఐక్యూ) అనేది ప్రభుత్వ కళాశాలలకు మాత్రమే వర్తిస్తోంది. ప్రైవేటు కళాశాలలకు వర్తించడం లేదు. జమ్ము కశ్మీర్ తప్ప మిగిలిన ఏ రాష్ట్ర విద్యార్థి అయినా ఏ రాష్ట్రంలో అయినా ఏఐక్యూ కింది 15% సీట్లకు (ప్రభుత్వ కళాశాలలకు) దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేటు కళాశాలల్లోనూ కోటాలో 50% కన్వీనర్, 35% కేటగిరీ బి లేదా మేనేజ్‌మెంట్ సీట్లు, 15% కేటగిరీ సి లేదా ఎన్ఆర్ఐ సీట్లు ఉన్నాయి కదా! ఇదే నిష్పత్తి అన్ని రాష్ట్రాల్లోనూ అమలవుతుందా?

జ: కాదు. ప్రతి రాష్ట్రంలోని ఈ సీట్ల శాతాలు వేర్వేరుగా ఉన్నాయి. విడిగా ఆ రాష్ట్ర ప్రవేశపరీక్ష కన్వీనర్ వెబ్‌సైట్‌లోకి వెళితే ఆ వివరాలు సులభంగా లభ్యమవుతాయి.

గుజరాత్, ఎంపీ, పంజాబ్, మహారాష్ట్రల్లో మేనేజ్‌మెంట్ సీట్లు (బి కేటగిరీ) ఆ రాష్ట్రంలోని విద్యార్థులకే ఇస్తారని అంటున్నారు. ఇది కరక్టేనా?

జ: ఇంతవరకు ఎంసీఐ వెబ్‌సైట్ లేదా ఆ రాష్ట్రాల్లోని కౌన్సెలింగ్ వెబ్‌సైట్లలో అలాంటిదేదీ పొందుపరచలేదు. దానిపై స్పష్టత జూన్ 22 లోపు వచ్చే అవకాశం ఉంది. గత ఏడాది ఇతర రాష్ట్రాల్లాగానే ఇక్కడ కూడా నిబంధనలకు అనుగుణంగా భర్తీ చేశారు. రాష్ట్రానికి గానీ, సామాజిక వర్గానికి గానీ ఎలాంటి రిజర్వేషన్ వర్తించలేదు.

తమిళనాడు కేటగిరీ బి కౌన్సెలింగ్ నోటిఫికేషన్లు, ఫీజు వివరాలు బయటకు రావడం లేదెందుకు? ఎప్పుడు జరుగుతాయి? ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

జ: తమిళనాడులో ప్రైవేటు కళాశాలల్లో ప్రముఖమైన వన్నీ స్వయం ప్రతిపత్తి గల విశ్వవిద్యాలయాలు అయ్యాయి. గతంలో నీట్ క్వాలిఫై అయినవారికి వారి హెచ్ఎస్‌సీ మార్కుల ప్రాతిపదికగా అడ్మిషన్ల ప్రక్రియ జరిగేది. అందువల్ల మనకు అవగాహన ఏర్పడేది కాదు. కానీ ఈ ఏడాది పైన చెప్పిన విధంగా జూన్ 22లోపు దానిపై సరైన ప్రకటన వెలువడాల్సి ఉంది.

త్రివిధ దళాల్లోకి తిరుగులేని దారి

రక్షణ రంగాల్లో చేరాలనుకునే వారికి యూపీఎస్సీ ఏటా రెండుసార్లు ఎన్డీఏతో అవకాశాన్ని కల్పిస్తుంది. దీని కోసం జరిగే పరీక్షలో నెగ్గితే అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యతోపాటు, సమాజంలో గౌరవనీయ హోదా కలిగిన ఉద్యోగం లభిస్తుంది. ప్రతిభ మాత్రమే ప్రామాణికమైన ఈ పరీక్ష విద్యార్థులకు వరమే.

ఎన్డీఏ-2 ప్రకటన విడుదల

యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ & నేవల్ అకాడమీ (ఎన్డీఏ & ఎన్ఏ) పరీక్షలో ఎంపికైనవారు మూడేళ్లపాటు పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో బీఏ, బీఎస్సీ కోర్సులు చదువుతారు. నేవల్ అకాడమీకి ఎంపికైనవారు నాలుగేళ్లపాటు కేరళలోని ఎజిమాలలో బీటెక్ విద్యను అభ్యసిస్తారు. రెండు చోట్లా విద్యార్థులకు అన్ని వసతులు ఉచితంగా సమకూరుస్తారు. డిగ్రీలను న్యూదిల్లీలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రదానం చేస్తుంది.

అర్హతలు

ఆర్మీ వింగ్ (ఎన్డీఏ)కు బాలురు మాత్రమే దరఖాస్తు చేయాలి. వీరు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడమీ)లకు దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ పాసై ఉండాలి. రెండో సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: జనవరి 2, 2000 తర్వాత; జనవరి 1, 2003 కంటే ముందు జన్మించినవారు అర్హులు.

శారీరక ప్రమాణాలు: ఎయిర్‌ఫోర్స్‌కి కనీసం 162.5 సెం.మీ. ఎత్తు ఉండాలి. మిగిలిన వాటికి కనీస ఎత్తు 157 సెం.మీ.ఎత్తుకు తగిన బరువు అవసరం.

రెండు దశల్లో ఎంపిక

అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. అవి- రాతపరీక్ష (ఆబ్జెక్టివ్ తరహా), ఇంటెలిజెన్స్ - పర్సనాలిటీ టెస్ట్. రాతపరీక్షలో మొత్తం 900 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో మ్యాథ్స్ నుంచి 300 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. పేపర్-2లో 600 మార్కులకు జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి ప్రశ్నలు ఉంటాయి. దీనికి వ్యవధి రెండున్నర గంటలు. రాతపరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో యూపీఎస్సీ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు నిర్వహిస్తుంది. ఇది 900 మార్కులకు జరుగుతుంది. ఇందులో భాగంగా గ్రూప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్, అవుట్‌డోర్ గ్రూప్ టాస్క్ ఉంటాయి. స్టేజ్-1లో అర్హత సాధించినవారినే స్టేజ్-2కి అనుమతిస్తారు. రాతపరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

ఖాళీల వివరాలు: మొత్తం 383. అందులో నేషనల్ డిఫెన్స్ అకాడమీ- 339 (ఆర్మీ-208, నేవీ-39, ఎయిర్‌ఫోర్స్- 92) నేవల్ అకాడమీ -44.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జులై 2 సాయంత్రం 6 గంటలు. **పరీక్ష తేదీ:** సెప్టెంబరు 9 **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి

వెబ్‌సైట్: www.upsc.gov.in

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 600 పీవో పోస్టులు

ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా పీవో పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. ఎంపికైనవాళ్లు ముందుగా మణిపాల్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్‌లో 9 నెలల పోస్టు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సు చదవాల్సి ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకున్నవాళ్లు ప్రొబేషనరీ ఆఫీసర్ హోదాతో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖల్లో విధుల్లో చేరుతారు.

పోస్టు-ఖాళీలు: ప్రొబేషనరీ ఆఫీసర్ ఇన్ జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్/ స్కేల్ 1- 600

అర్హత: 55% మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.

వయసు: 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: 28.07.2018.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 12.06.2018 నుంచి 02.07.2018 వరకు.

వెబ్‌సైట్: www.bankofbaroda.co.in

నౌకాదళంలో ఖాళీలు

ఇండియన్ నేవీలో స్టివార్డ్, చెఫ్, హైజీనిస్ట్ పోస్టుల భర్తీకి అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు.

అర్హత: మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతోపాటు నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి.

వయసు: 01.04.1998 నుంచి 31.03.2002 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, శారీరక దృఢత్వం, వైద్య, దృష్టి సంబంధ ప్రామాణిక పరీక్షల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 18.06.2018 నుంచి 01.07.2018 వరకు.

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

వైజాగ్ స్టీల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్)లో మేనేజ్‌మెంట్ ట్రెయినీల భర్తీకి దరఖాస్తులు.

పోస్టు-ఖాళీలు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హెచ్ఆర్/ మార్కెటింగ్)- 14

అర్హత: ఎంబీఏ/ పీజీ డిగ్రీ/ పీజీ డిప్లొమా(హెచ్ఆర్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్ & ఇండస్ట్రియల్ రిలేషన్స్/ లేబర్ వెల్ఫేర్/ సోషల్ వర్క్/ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణత.

వయసు: 27 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: యూజీసీ-నెట్ జులై 2018 స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 25.06.2018 నుంచి 16.07.2018 వరకు.

వెబ్‌సైట్: www.vizagsteel.com

ఐవోసీఎల్ ఈస్టర్న్ రీజియన్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఈస్టర్న్ రీజియన్‌లో ఖాళీలు- జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్) గ్రేడ్ 1: 50

అర్హత: 45 శాతం మార్కులతో హయ్యర్ సెకండరీ ఉత్తీర్ణతతో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఏడాది పని అనుభవం తప్పనిసరి.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 16.06.2018 నుంచి 07.07.2018 వరకు.

www.iocl.com

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు